క్లుప్తంగా

బీజేపీలో చేరిక



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బోగ రామస్వామి పీఎం మోదీ పాలనకు ఆకర్షితుడై బీజేపీలో చేరారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి సమక్షంలో చేరగా, ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు కొత్తపల్లి గణేష్, నాయకులు రెంజెర్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి శంకుస్థాపన



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ షిరిడి సాయిబాబా దేవాలయం వద్ద వంటశాల, భక్తుల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం భూమిపూజ చేశారు. భక్తుల విరాళాలలో నిర్మాణాలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పోలేపల్లి లచ్చయ్య, బద్దం గంగారెడ్డి, యెనుగందుల శశిధర్, పెంబర్తి నరేష్ కుమార్, పోతు మురళి, పోతు గణేష్, మహిళా సంఘాల సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో ఇటీవల మరణించిన జుంబరాతి శ్యామ్ కుటుంబానికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి యువసేన సభ్యులు మంగళవారం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్యామ్ మరణించడంతో వారికి ఆర్థిక సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి యువసేన సభ్యులు రేగుల్ల రాములు, ప్రతాప్, సత్యం, శ్రీనివాస్, నవీన్, అశోక్, హరీష్ పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామంలో రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బోనాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయం బోనాల ఊరేగింపు నిర్వహించారు. గౌడ కులస్తులు భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బైక్ ర్యాలీ



రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా గ్రామంలో ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కరాటే రమేష్ హాజరై మాట్లాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, తగిలేపల్లి మాజీ సర్పంచ్ వెంకటేష్, దర్శె సాయిలు, కప్ప గణేష్ వివిధ మండలాల ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించాలి

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారానికి గ్రామాలకు వచ్చే ప్రజాప్రతినిధులను తమ సమస్యల పై ప్రశ్నించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ కార్మికులకు పిలుపు నిచ్చారు. మంగళవారం బోధన్ మండలం అమ్దాపూర్ లో నిర్వహించిన బీడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలో కి రాగానే రేవంత్ రెడ్డి వంద రోజుల్లో బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2016 నుంచిరూ.4 వేలకు పెంచి జీవన భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు.అర్హులైన బీడీకార్మికులందరికి జీవన భృతి ఇస్తామని అన్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫారసు మేరకు ఈపీఎఫ్‌కు రాజీనామా చేసిన కార్మికులకు నెలకు ఇచ్చే పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సేవల్లో జాప్యం

- వార్డు అధికారులకు లేని కార్యాలయాలు
- మున్సిపల్ కార్యాలయంలోనే అధికారులను కలవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం మున్సిపల్ పరిధిలో వార్డు అధికారులను నియమించింది. ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరమయ్యే విధంగా చర్యలు తీసుకుంది. వార్డు అధికారులకు కార్యాలయాలు లేకపోవడంతో స్థానిక ప్రజలు కలిసి తమ గోడును విన్నవించుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడంలో జాప్యం నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. ఆర్మూర్‌లోని 36 వార్డులలో 19 మంది వార్డు అధికారులు ఉన్నారు. ఆయా వార్డులో ప్రజలకు ఏ సమస్య ఉన్న వార్డు అధికారులకు తెలియజేస్తే సకాలంలో పని పూర్తయ్యే విధంగా చూస్తారు. వార్డు అధికారులు ఉద యం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వర కు విధులు నిర్వహిస్తున్నారు. వార్డు అధికారులు శానిటేషన్ నుంచి డెత్, బర్త్, అభివృద్ధి పనులతో పాటు ఇతర పనులు పర్యవేక్షణ చేస్తుంటారు. కాలనీలో అధికారులకు ప్రత్యేక కార్యాలయం ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి విధులు నిర్వహించే అవకాశం ఉంది. వార్డు అధికారులు మున్సిపల్ కార్యాలయంలో పనులు చేసుకోవాల్సి వస్తుంది.



మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ రాజు (ఫైల్)

ప్రత్యేక కార్యాలయం లేదు



వార్డులలో ప్రత్యేకంగా వార్డు కార్యాలయాలు లేవు. స్థానికంగా ఉంటే ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుంది. వార్డు అధికారులు వార్డులలో ఉంటున్నప్పటికి ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో వచ్చి తమ పనులు చేసుకుంటున్నారు. – రాజు,మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారు

పెర్కిట్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులన కాలరాస్తూ అధికారం చేజిక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో మంగళవారం ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రజల వద్ద నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో బీజేపీ ఓట్లను చోరీ చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఓటు చోరీకి అరికట్టడానికి ఆర్మూర్ నియోజకవర్గంలో 10 వేల మంది నుంచి సంతకాలను సేకరించి కాంగ్రెస్ అధిష్టానంతో పాటు ఎలక్షన్ కమిషన్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పొద్దుటూరి వినయ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నా రెడ్డి, దాసరి శ్రీకాంత్, రాంసన్, జన్నెపల్లి గంగాధర్, సీహెచ్ పోశెట్టి, శాంతి కుమార్, గంగసాయన్న, రమేష్, సాయన్న, చరణ్, నితిన్, అయ్యప్ప శ్రీనివాస్, పవన్ పండిత్, అమృత్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చేపూర్‌లో ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం వెల్మల్ గ్రామంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపై కొనసాగుతున్న మారణ హోమాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పాలస్తీనా ప్రజలకు మద్దతు తెలుపుతూ ఈ నెల 9 వరకు ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు తెలిపారు. భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు మద్దతు తెలపాలని, ప్రజాస్వామ్య రక్షణకు కృషి చేయాలని కోరారు. డివిజన్ కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్, నాయకులు దేవన్న, పోశెట్టి, దోసపల్లి లింగన్న, భాజన్న, గంగారాం, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రహదారి అంచు

వేల్పూర్: వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామానికి పచ్చలనడ్కుడ నుంచి ఉన్న రహదారి అంచు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రహదారి అంచు వరకు మట్టి కొట్టుకు పోయింది. ఆకస్మికంగా రహదారి దిగితే ప్రమాదం పొంచి ఉంది. అక్లూర్ గ్రామస్తులు తమ అవసరాల కోసం పచ్చల నడ్కుడకు, ఆర్మూర్‌కు వెళ్లడానికి నిత్యం ఇదే రహదారి గుండా ప్రయాణిస్తారు. పచ్చలనడ్కుడ గ్రామస్తు లు తమ పంట పొలాలకు వెళ్లడానికి, ఇతర గ్రా మాల వారు అక్లూర్‌కు, మోతె గ్రామాలకు ఈ రహ దారిలో వెళ్తారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదనీటితో రోడ్డు కోతకు గురైంది. రోడ్డు కోతకు గురైన చోట మట్టి పోయించాలని అక్లూర్ గ్రామస్తులు కోరుతున్నారు.



కోతకు గురైన పచ్చలనడ్కుడ నుంచి అక్లూర్ వెళ్లే రహదారి అంచు

గుండెపోటుతో జర్నలిస్ట్ మృతి

బోధన్: బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఓ ప్రముఖ దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ జంగం ఉమాకాంత్(55) మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో కన్నుమూశారు. ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు,ప్రజాప్రతినిధులు, వీరశైవ సమాజ్ ప్రతినిధులు ఉమాకాంత్ మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలి

ఆర్మూర్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై షూ విసిరిన మతోన్మాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆర్మూర్ సంయుక్త మండలాల కార్యదర్శులు బి.కిషన్, ఆకుల గంగారాం డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాకేశ్ కిశోర్ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మాస్‌లైన్ పార్టీ నాయకులు శేఖర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు నరేందర్, నజీర్, శ్రీనివాస్, పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు నిఖిల్, పీవైఎల్ నాయకులు నరేష్, రవి, లింబన్న, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ఆర్మూర్‌టౌన్: భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై షూ విసిరిన న్యాయవాది రాకేష్ కిషోర్ ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తూ ఆర్మూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్, సీనియర్ న్యాయవాది లోకభూపతి రెడ్డి, గంట సదానందం, చిలుక కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో రాకేశ్ కిశోర్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సుప్రీంకోర్టులో సోమవారం చోటు చేసుకున్న ఘటనను దళిత ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ రస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నిజాంసాగర్ కెనాల్ వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించిన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు కొక్కెర భూమన్న, ప్రదీప్, పూర్ణ, మూగ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ కెనాల్ వద్ద రాస్తారోకో చేస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

కమ్మర్‌పల్లి: భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై షూ విసిరిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండల అంబేడ్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు సుంకరి విజయ్ డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు కొంటికంటి నరేందర్, పాలేపు రాజేశ్వర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్: ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రతి మంగళ, గురువారాల్లో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నామన్నారు. ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్సను అందించారు. ఈ శిబిరంలో ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ కిషన్, సురేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య , ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణంలో కమ్యునిటీ హెల్త్ వర్కర్, బ్యూటిషియన్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రాంగణం అధికారిణి పీ ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీహెచ్‌డబ్ల్యూ కోర్సులో మూడు నెలలు, టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సులకు నెల రోజుల పాటు ఉచిత శిక్షణనివ్వనున్నట్లు తెలిపారు. సీహెచ్‌డబ్ల్యూ కోర్సు నేర్చుకునే వారు పదో తరగతి, టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సు నేర్చుకునే వారు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థినులు బోనాఫైడ్, ఆధారు కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు 4 పీపీ సైజు ఫోటోలతో ఈ నెల 16 లోగా ప్రాంగణంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7660022520, 8332949550, 8790200180 నంబరులలో సంప్రదించాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో అధ్యాపకుడి పోస్టుకు..

రుద్రూర్: మండలంలోని అంబం (ఆర్) శివారులో గల ఆదర్శ పాఠశాల /కళాశాలలో గణితం (పీజీటీ) బోధించడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవేందర్ కులకర్ణి తెలిపారు. ఇంటర్మీడియట్ బోధకులుగా మూడేళ్ల అనుభవం కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే డెమోకు అర్హత, ఆసక్తి గల వారు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

రేపు సైబర్ నేరాలపై అవగాహన సమావేశం

బోధన్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ఆఫీస్ ఆవరణలో గల గురువారం సంఘ కార్యాలయంలో సైబర్ నేరాలు– జాగ్రత్తల అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆ సంఘం బోధన్ శాఖ అధ్యక్షుడు ఎం. రాజేశ్వర్‌రావు, మంగళవారం ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ సైబర్ క్రైం విభాగం ఏసీపీ వెంకటేశ్వర్‌రావు ,వారి బృందం సైబర్ నేరాల పై అవగాహన కల్పించేందుకు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు ,సీనియర్ సిటిజన్స్, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మానసిక ఒత్తిడికి లోనుకావొద్దు

డిచ్‌పల్లి: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావద్దని, శారీరక వ్యాయామం, యోగా ఆచరించడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ టి.కేశవకుమార్ సూచించారు. మంగళవారం నిజామాబాద్ రీజియన్ లయన్ సహారా ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ వారు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి), మెంట్రాజ్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో మానసిక ఒత్తిడి.. జయించడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉద్యోగుల కృషితోనే మెరుగైన సేవలు



బోధన్‌రూరల్ : విద్యుత్ శాఖలో ఉద్యోగులు, సిబ్బంది కృషితోనే ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడం సాధ్యమవుతుందని బోధన్ ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ట్రాన్స్ సీఎండీ వరుణ్ రెడ్డి (ఐఏఎస్) బోధన్ డివిజన్, రుద్రూర్ సబ్ డివిజన్‌లను ర్యాకింగ్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంగళవారం బోధన్ ట్రాన్స్ కో డీఈ కార్యాలయంలో డీఈ ఎండీ ముక్తార్, ఏడీఈ తోట రాజశేఖర్ లను ఏఈలు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఈలు నాగేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై అనాసక్తి

- నందిపేట మండలంలో 699 ఇళ్లు మంజూరు.. నిర్మాణంలో 385
- ఇళ్లు మంజూరైనా నిర్మాణానికి కొందరు వెనుకంజ
- అక్రమాలకు తావులేకుండా అధికారుల చర్యలు



నందిపేటలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మూడడుగుల ముందుకు, ఏడడుగుల వెనక్కి అన్న చందంగా మారింది. మొదటి విడతలో మంజూరు చేసిన ఇళ్లలో సగం కూడ ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. మొదటి విడత గడువు పూర్తి కావస్తున్నా ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. నందిపేట మండలంలో మొత్తం 699 ఇళ్లు మంజూరు చేశారు. అందులో 385 మాత్రమే నిర్మాణాలు చేపడుతున్నారు. స్థలాలున్న లబ్ధిదారులను ఎల్–1 లో ఎంపిక చేయగా ఇప్పుడున్న ఇళ్లను కూల్చితే వర్షాకాలంలో ఎక్కడ ఉండాలనే సంశయంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఒకవేళ వ్యయం పెరిగితే లబ్ధిదారుడు ఆ ఇంటి నిర్మాణాన్ని మధ్యలో వదిలి వేయద్దనే నిబంధనలు ఉండడంతో మరి కొందరు వెనుకంజ వేస్తున్నారు.

నిబంధనలు కఠినతరం..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల కోసం మొదటి విడతలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొదటి విడతలో తమకంటే తమకంటూ పోటీ పడుతూ నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అనుమతులు తీసుకున్నారు. కొందరు అనుమతులు వచ్చిన అనంతరం నిర్మాణం చేపట్టలేదు. గతంలో మాదిరిగా అనుమతులు వచ్చిన తర్వాత ఒకచోట వేరే వారు నిర్మించిన ఇళ్ల దగ్గర ఫోటో దిగి బిల్లులు తీసుకుందామన్న ప్రక్రియ బెడిసి కొట్టింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మొదటి నుంచి సాంకేతిక పరిజ్ఞానం జోడించి నిర్మాణాల ప్రక్రియను చేస్తుండడంతో అక్రమాలకు తావు లేకుండా పోయింది. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో నిజమైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలి

బోధన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపించుకునేందుకు కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర నాయకులు గైని గంగాధర్, నీరడి ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు సింగాడే పాండు కార్యకర్తలు పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్,జనసేన పార్టీల కీలక యువనాయకులు మహమ్మద్ షేక్,రమేష్ దాస్ బీఎస్పీలు చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలు నాయకులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ బీసీ,ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పోరాటం చేసిన ఏకైక పార్టీగా విశ్వసించి యువనాయకులు బీఎస్పీలో చేరారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరివెసు సంతోష్, బోధన్ అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జి నీరడి రవి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఎస్పీ నాయకులు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



గోవూరు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మోస్రా ఆర్ఐ నాగమణి

వర్ని (మోస్రా): రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని మోస్రా ఆర్ఐ నాగమణి సూచించారు. మంగళవారం మండలంలోని గోవూరు సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2389, బీ గ్రేడ్ రకానికి రూ. 2369 చెల్లిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. సొసైటీ సీ ఈవో శేఖర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



కోటగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గంగాధర్

కోటగిరిలో..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ గంగాధర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు తక్కువ ధరకు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దన్నారు. మద్దతు ధర ఇస్తున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఐకేపీ ఏపీఎం భాస్కర్, మండల సమాఖ్య అధ్యక్షు రాలు సుజాత, కార్యదర్శి శ్రీగంగ, కోశాధికారి భాగ్యశ్రీ, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

పెర్కిట్(ఆర్మూర్): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అధికారులకు సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వహించే ఆర్మూర్ డివిజన్‌లోని ప్రిసైడింగ్ అధికారులకు మంగళవారం శిక్షణ తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం ఎన్నికల నియామవళి, విధులపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు బీ శివాజీ, గంగాధర్, డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో రాజ గంగారాం, సంగెం అశోక్, గంట అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ఫీజు వసూళ్లకు వ్యతిరేకంగా పోరాడాలని తీర్మానం

బోధన్: విద్యారంగ సమస్యలు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజు వసూళ్లు, వేధింపులు అంశాలపై మంగళవారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో విద్యార్థి సంఘాల జేఏసీ డివిజన్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల వసూళ్లకు విద్యార్థులకు వేధింపులు ఎక్కువయ్యాయని, పరిమితి లేకుండా ఫీజు వసూళ్లకు వ్యతిరేకంగా పోరాడాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు నాయకులు వెల్లడించారు. బోధన్‌లో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు, ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ భవనాల అద్దె బిల్లులు చెల్లింపు,పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం తదితర అంశాలపై ఉద్యమ కార్యాచరణ పై తీర్మానాలు ఆమోదించినట్టు తెలిపారు. స్థానిక సీనియర్ జర్నలిస్టు ఉమాకాంత్ ఆకస్మిక మృతిపై సంతాపం తెలిపారు. నాయకులు నాగరాజు, గౌతం కుమార్,సంజయ్, సాయికుమార్, మౌనిక, మోసిన్, సంతోష్, బాలరాజు, రాజన్న, జనార్దన్, శ్రీకాంత్, సంతోష్ ,నరేష్, ప్రతాప్, నరేందర్, ఐఎఫ్‌టీయూ,సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వరదయ్య, శంకర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



బోధన్‌లో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల జేఏసీ డివిజన్ నాయకులు